నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | మార్చి 29, 2024 | www.navatelangana.com

బైక్‌ల నుంచి పెట్రోల్ చోరీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్


పెట్రోల్ చోరీ చేస్తున్న దుండగుడు

బైక్‌ల నుంచి పెట్రోల్ చోరీ చేసిన విడియో మండల కేంద్రంలో గురువారం వైరల్‌గా మారింది. మండల కేంద్రానికి చెందిన ప్రయివేట్ డాక్టర్ ఇంట్లో ఉన్న బైక్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి పెట్రోల్ చోరీ చేశాడు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇదే ఇంట్లో మండల కేంద్రంలో ఉన్న స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ కొనారెడ్డి అద్దెకి ఉండటం గమనార్హం.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. నిజామాబాద్ నగరానికి చెందిన దంపతులు కర్నాటకలోని ఓ లాడ్జిలో గురువారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు నిజామాబాద్ పోలీసులకు కర్నాటక పోలీసులు ప్రాథమిక సమాచారం అందించారు. అప్రమత్తమైన నాల్గవ పోలీస్ స్టేషన్ అధికారులు విచారణ చేపట్టారు. మృతులు గాయత్రీ నగర్ ప్రాంతానికి చెందిన మేడవరపు రాజు(55), మేడవరపు స్వాతి(53)గా పోలీసులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కర్నాటక రాష్ట్రంలోని కొడగు జిల్లా సోమవార్ పేట్ పరిధిలోని లాడ్జిలో సూసైడ్ చేసుకున్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.




కౌన్సిలర్‌ల గోవాట్రిప్

- మున్సిపల్ పీఠం 'హస్తగతం' చేసుకునేందుకు క్యాంప్‌నకు తరలిన పలువురు
- 30న మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- అదే రోజు నేరుగా హాజరయ్యే అవకాశం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మునిసిపల్ చైర్మన్ నిట్టు జాహ్నవిపై అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. బలనిరూపణకు ఈ నెల 30 తేదీని ఫిక్స్ చేశారు. చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న ఉరదొండ రవి వనిత సారథ్యంలో 37 మంది కౌన్సిలర్‌లు గోవా ట్రిప్‌లో ఎంజాయ్ చేస్తున్నారు. 30వ తేదీనా క్యాంప్ నుంచి నేరుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోనున్నారు.

అవిశ్వాసమా? రాజీనామానా..?

30న సమావేశం సందర్భంగా అవిశ్వాసానికి మద్దతు వస్తే.. నిట్టు జాహ్నవి తన పదవిని కోల్పోతారు. అయితే అంతకంటే ముందే రాజీనామా యోచనలో ఉన్నట్టు సమాచారం. నిజామాబాద్ డీ సీ సీ బి చైర్మన్ పదవికి పోచారం భాస్కర్ రెడ్డి సైతం ఒక రోజు ముందు రాజీనామా ప్రకటించారు. అదే విధంగా నిట్టు జాహ్నవి సైతం రాజీనామా చేసే ఆలోచన చేస్తున్నట్టు కార్యకర్తలు పేర్కొంటున్నారు. అయితే ముందస్తు రాజీనామా చేస్తే వైస్ చైర్‌పర్సన్‌కు ఇన్‌చార్జ్‌గా ఇచ్చే అవకాశం ఉంటుంది. ఇది వరకు నిట్టు జాహ్నవి, ఇందు ప్రియ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా కలిసే పని చేశారు.


కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం

కౌన్సిలర్ ల మద్దతు ఎవరికో

మునిసిపల్ కౌన్సిలర్‌ల క్యాంప్‌ను డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా ఖర్చు మాత్రం ఉరదొండ వనిత రవి భరిస్తున్నట్టు సమాచారం. అదే జరుగుతే కౌన్సిలర్ లందరూ వనితకి మద్దతు తెలుపుతారా? లేకా ఇందూప్రియకు పట్టం కడతారా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

చైర్మన్ ఎవరనేదనిపై అధిష్టానం అయోమయం

అవిశ్వాసంపై ఉత్కంఠ రేపుతున్న కామారెడ్డి మునిసిపల్ చైర్మన్ ఎవరనేది ఇంకా కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయానికి రాలేకపోతుందని ఆ పార్టీలోని కొందరి నాయకుల చర్చ. ఇప్పటికి 12 రోజుల నుండి క్యాంప్ లో ఉన్న కౌన్సిలర్ల ఇప్పటి వరకు ఎవరిని చైర్మన్ చేయాలనే ఆదేశాలు కాంగ్రెస్ పార్టీ చెప్పక పోవడంతో కౌన్సిలర్స్ అందరు ఉరదొండ వనిత వైపే మొగ్గు చూపుతున్నారని సమాచారం. వైస్ చైర్మన్‌గా ఇప్పటి వరకు ఉన్న ఇందుప్రియ చైర్మన్ పీఠం పై కన్నేసిన కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం సంపాదించుకోలేకపోయారు.

గోవా క్యాంప్‌లో హోలీ సంబురాలు

అవిశ్వాసం నేపథ్యంలో కార్పోరేట్‌లు చేజారకుండా ప్రత్యేక శిబిరానికి గోవా తరలించారు. సుమారు 15 రోజులుగా అక్కడే మకాం వేశారు. ఇటీవల హోలీ వేడుకలు సైతం కౌన్సిలర్‌లు అందరు కలిసి నిర్వహించిన ఫోటో వైరల్‌గా మారింది. ఇంట్లో వారితోనూ, బంధువులతోను మాటలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

పోలీస్ స్టేషన్‌పై, కానిస్టేబుల్‌పై దాడి

- నిందితుడి రిమాండ్

నవతెలంగాణ-రామారెడ్డి



పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయడంతో పగిలిన అద్దాలు.. కానిస్టేబుల్‌కు గాయం

రామారెడ్డి పోలీస్ స్టేషన్‌పై, పోలీస్ కానిస్టేబుల్‌పై గురువారం కత్తితో దాడి చేసి, పోలీస్ స్టేషన్ అద్దాలు పగలగొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బిట్ల రవి గురువారం అర్ధరాత్రి 1:24 నిమిషాలకు తల్లిదండ్రులతో గొడవ పడడంతో, తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ సిద్ధిరాములు తల్లిదండ్రులతో మాట్లాడుతుండగా, రవి పోలీస్ స్టేషన్‌కు కత్తితో వచ్చాడు. తల్లిదండ్రులు ఇంటికి వెళ్ళిపోగానే, పోలీస్ స్టేషన్ తలుపులు పగలగొట్టి, సిద్ది రాములుపై కత్తితో దాడి చేసి, చంపడానికి ప్రయత్నించాడు. ఏఎస్ఐ రవీందర్, కానిస్టేబుల్ గణేష్ అడ్డుకొనగా, బూతులు తిడుతూ చేతులతో కొట్టాడని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై విజయ్ తెలిపారు. సిఐ రామన్ బిట్ల రవిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై విజయ్ తెలిపారు.

పోలీస్‌సిబ్బందిపై దాడి.. నిందితులపై కేసు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బిచ్కుంద ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ మోహన్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... పెద్ద కొడప్‌గల్ ఎస్ఐ కోనా రెడ్డితో పాటు, పోలీసులు బుధవారం సాయంత్రం బేగంపూర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో మండలంలోని కాస్లాబాద్ గ్రామానికి చెందిన వ్యక్తులు మద్యం సేవించి వచ్చి వాహనాలు తనిఖీ చేసే అధికారం మీకు ఎవరిచ్చారంటూ ఎస్ఐ కోనా రెడ్డితో తో పాటు, పోలీస్ సిబ్బందిపై దాడి చేశారని ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు. దీంతో పెద్ద కొడప్గల్ ఎస్ఐ కోనా రెడ్డి ఉన్నతాధికారులకు పిర్యాదు చేయగా, ఉన్నతాధికారులు విచారణ అధికారిగా బిచ్కుంద ఎస్ఐ మోహన్ రెడ్డి ని విచారణ అధికారిగా నియమించారు. దీంతో కేసును విచారించి పోలీస్‌లపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించనట్లు ఎస్ఐ మోహన్ రెడ్డి తెలిపారు.

రైతుల సంక్షేమమే సొసైటీల లక్ష్యం

నవతెలంగాణ-సదాశివనగర్


మహాజన సభలో పాల్గొన్న రైతులు

రైతుల సంక్షేమమే లక్ష్యంగా సొసైటీలు పనిచేస్తాయని ఉత్నూర్ సింగిల్‌విండో చైర్మన్ ప్రభాకర్ రావు అన్నారు. గురువారం గ్రామంలోని రైతువేదికలో సింగిల్‌విండో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో సింగిల్‌విండో అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడంతోపాటు సబ్సిడీ ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. రుణాల చెల్లింపునకు సంబంధించి వన్‌టైమ్ సెటిల్మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరో రెండు వారాల్లో రైతుల కోసం డ్రోన్ అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిఈఓ నైమోద్దీన్, సొసైటీ మానిటరింగ్ ఆఫీసర్ నగేష్, సొసైటీ డైరెక్టర్లు,రైతులు,సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లి వాహనం బోల్తా

- 12 మంది గాయాలు

నవతెలంగాణ-లింగంపేట్



వాహనం బోల్తాపడటంతో గాయపడ్డ పలువురు..

వివాహ వేడుకలకు వెళుతుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న 12 మందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని నల్లమడుగు చౌరస్తా వద్ద ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..

లింగంపేట్ మండలంలోని లింగం పల్లి గ్రామం చెందిన కొత్త కిషన్ కుమారుడి వివాహానికి లింగంపల్లి నుండి వారి బంధువులను గ్రామ సమీపంలోని నల్ల మడుగు చౌరస్తా వద్ద జీఎస్ఆర్ గార్డెన్‌కు గూడ్స్ వాహనంలో తీసుకొస్తు న్నారు. ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై ఫంక్షన్ హాల్ సమీపంలో వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ఉన్న సుమారు 12 మందికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో లింగంపల్లి గ్రామానికి చెందిన కొత్త సావిత్రి, లక్ష్మి, సత్యవతి వారి బంధువులైన వడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి, గ్రామానికి చెందిన లక్ష్మీ, గాంధారి కి చెందిన అంజయ్య, పూరంచ రాములుకు గాయాలు అయ్యాయి. వీరిని 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న లింగంపేట్ ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి ఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారి పై రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కాగా పెండ్లి వేడుకల్లో విషాద చాయలు అలుముకున్నాయి.

ప్రేమజంట ఆత్మహత్య

బాసరలో రైలుకింద దూకి బలవన్మరణం

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ


సూరం శ్రీకాంత్


నందిత

రైలు కింద దూకి ప్రేమజంట ఆత్మహత్య చేసుకుంది. నిజామాబాద్ నగరానికి చెందిన సూరం శ్రీకాంత్ (28), నందిత(20) నిర్మల్ జిల్లా బాసరలోని రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద దూకి బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ నగరంలోని కోటగల్లికి చెందిన సూరం శ్రీకాంత్(28) స్థానిక విశ్వభారతి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. సీతారాంనగర్ కాలనీకి చెందిన నందిత(20)గా నిశిత కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతోంది. వీరిద్దరూ కొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. అయితే సూసైడ్‌కు గల కారణాలు తెలియాల్సి ఉందని రైల్వే ఎస్సై సాయారెడ్డి తెలిపారు. ఇద్దరు మృతితో ఇరువురి కుటుంబాల్లో విషాదం నెలకొంది.

మృతదేహం సాక్షిగా ఆస్తితగాదాలు

- తల్వార్, కట్టెలతో ఒకరిపై ఒకరు దాడులు

నవతెలంగాణ-రామారెడ్డి



తల్వార్‌తో దాడి చేయగా.. చేతివేళ్లకు గాయం..

చనిపోయిన శవం ఇంట్లో ఉండగానే ఒకరిపై ఒకరు తల్వార్, కట్టెలతో దాడి చేసుకున్న ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... మండలంలోని ఇస్సన్నపల్లి గ్రామానికి చెందిన చింతల కిష్టవ్వ (55) అనారోగ్యంతో మృతిచెందగా, భర్త గతంలో చనిపోయాడు. పిల్లలు లేరు. ఆమె మంచిచెడులు చింతల కిష్టవ్వ చెల్లె, కొడుకు అప్పర బోయిన నర్సింలు చూసుకున్నారు. అయితే ఆమె పేరుపై 30 గుంటల భూమిని, ఇల్లు ఉంది. వీటి విషయంలో ఆమె మరిది మైసయ్య, భార్య పిల్లలు.. కిష్టవ్వ చెల్లెలు కొడుకుతో పాటు బంధువులతో గొడవకు దిగారు. రూ 2లక్షలు ఇస్తేనే కిష్టవ్వ దహన సంస్కారాలు చేయనిస్తామని అడ్డుకున్నారు. దీంతో మృతురాలు, బంధువుల ఇరు వర్గాల మధ్య తోపులాటతో ప్రారంభమైన గొడవ, కట్టెలతో కొట్టుకోవడానికి దారి తీసింది. మైసయ్య కొడుకు చింతల రవి ఇంట్లో నుండి తల్వార్ తో మృతురాలు చెల్లెలు కొడుకు అప్పర బోయిన నర్సింలు రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి వాసిపై చంపటానికి రాగా, గురి తప్పి నర్సింలు ఎడమచేతు 3 వేలు తెగడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు. సంఘటన స్థలాన్ని సిఐ రామన్ పరిశీలించారు. పోలీసులు దగ్గరుండి అంత్యక్రియలు పూర్తి చేయించారు.

రూ. 272 కూలీ అందేలా పని చేయించాలి

- అడిషనల్ డిఆర్‌డిఓ వామన్ రావు

నవతెలంగాణ-రామారెడ్డి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ డీఆర్‌డీవో

ఉపాధి హామీ కూలీలకు రూ.272 రోజువారి కూలీ అందేలా, కొలతలతో పని చేయించాలని ఉపాధి హామీ సిబ్బందికి అడిషనల్ డిఆర్‌డిఒ వామన్ రావు సూచించారు. మండలంలోని కన్నాపూర్ లో ఉపాధి హామీలో భాగంగా కందకాల పనిని డీపీవో దత్తాద్రి, ఎంపీడీవో సవితా రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. ఏప్రిల్ మొదటి వారం నుండి కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో ధర్మారెడ్డి, టి ఏ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు మోక్షమెన్నడో..?

- శాఖల మధ్య సమన్వయలోపంతో నిలిచిన రోడ్డు విస్తరణ
- మద్దెలచెర్వు-తిమ్మానగర్ మధ్య
- ప్రమాదకరంగా మారిన ప్రయాణం

నవతెలంగాణ-పిట్లం


గుంతల మయంగా మారిన సింగిల్ రోడ్డు

దేవుడు వరమిచ్చినా.. పూజారి కనుకరించలేదన్న చందంగా శాఖల మధ్య సమన్వయ లోపం.. వాహనదారులకు శాపంగా మారుతోంది. రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరైనా.. ఆర్అండ్‌బీ-అటవీశాఖ మధ్య సమన్వయం లేకపోవడంతో పనులు ముందడుగు వేయడం లేదు. దీంతో వాహనదారులు గుంతలమయంగా ఉన్న సింగిల్ రోడ్డుతో ఇక్కట్లు పడుతున్నారు.

బాన్సువాడ నుంచి పిట్లం వరకు ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం రోడ్డు విస్తరణలో భాగంగా గత ప్రభుత్వం 2016-17లో మద్దెల చెరువు నుండి జిల్లా సరిహద్దు గ్రామమైన తిమ్మానగర్ నల్లవాగు బ్రిడ్జి వరకు గాను 25 కోట్ల నిధుల వయ్యముతో నాటి రోడ్ల భవనాల శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాగా అటవీ శాఖ నిబంధనాలను అతిక్రమించి రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని ఆరోపణలతో అటవీశాఖ అధికారులు మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి నుండి జగదాంబ తండా, సిద్దాపూర్ గ్రామం నుండి కుర్తి గేట్ వరకు పనులను అడ్డుకోవడంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. నాటి నుండి నేటి వరకు అనుమతులు రాకపోవడంతో సింగిల్ రోడ్డుకె పరిమితమైన రోడ్డుపై బస్సులు ఇసుక లారీలు ఎదురైనప్పుడల్లా వారి, మిగతా ప్రయాణికుల బాధలు వర్ణతీతం. గతంలో బాన్సువాడ నుండి పిట్లం వైపు, పిట్లం నుండి బాన్సువాడ వెళ్లే బస్సులు ఎదురై ఒకదానికి ఒకటి తగిలి ఇరుక్కుపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉన్నారు. అత్యవసర సమయంలో వైద్యం కోసం వెళ్తుండగా సైతం అంబులెన్స్‌లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు వరుసల రోడ్డు నిర్మాణం పూర్తికాక మిగిలిపోయిన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని సభ్యులు పలుమార్లు సర్వసభ్య సమావేశంలో ఆవేదన వెలిబుచ్చారు. నాటి మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే 3 నెలల క్రితం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల సమయములో మద్దెల చెరువు-తిమ్మా నగర్ గ్రామ సరిహద్దు వరకు నిర్మించిన రెండు వరసల రోడ్డు నిర్మాణ పనులలో అక్కడక్కడ మిగిలిపోయిన రోడ్డు నిర్మాణ పనులకు అటవీ శాఖ అధికారులు క్లియరెన్స్ రావలసి ఉన్నప్పటికీ, 7.50 కోట్లు నిధులు మంజూరి అయ్యాయని తెలిపారు.

శాఖల మధ్య లోపించిన సమన్వయం

రోడ్డు విస్తరణ చేపట్టే సమయంలో అటవీ ప్రాంతం నుంచి రోడ్డు వెళ్తే.. దానికి బదులుగా రెవెన్యూ భూమిని ఆర్అండ్‌బీ అధికారులు అటవీశాఖకు అప్పగించాల్సి ఉంది. రోడ్డు విస్తరణలో చెట్లు నరికివేస్తే నిబంధనల ప్రకారం.. నష్టపరిహారం అటవీశాఖకు నష్టపరిహారం చెల్లిస్తే.. ఆ నిధులతో మరో చోట మొక్కలు నాటి సంరక్షించే అవకాశం ఉంటుంది. దీంతో పాటు అటవీ ప్రాంతం నుంచి వెళ్తున్న రోడ్డుకు ఇరువైపులా దిమ్మెలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. దానికి సంబంధించిన నిధులు సైతం ఫారెస్ట్‌కు ముట్టజెప్పాల్సి ఉంటుంది. వీటన్నింటిని పూర్తి చేస్తే అటవీశాఖ నుంచి అనుమతి వచ్చే అవకాశం ఉంటుందని ఫారెస్ట్ అధికారులు పేర్కొంటున్నారు. ఆర్అండ్‌బీ, అటవీశాఖలు సమన్వయం చేసుకొని అనుమతులు వచ్చేలా కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అసలే సింగిల్ రోడ్డు ఉండగా.. దానిపై గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి వేళల్లో, ఎదురుగా భారీ వాహనాలు వచ్చే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు క్లియరెన్స్ చేసుకొని రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేసేందుకు చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

అనుమతులు లేక నిలిచాయి

ఆర్అండ్‌బి ఏఈ వినోద్ కుమార్

మద్దెల చెర్వు నుండి తిమ్మా నగర్ గ్రామ సరిహద్దు వరకు నిర్మితమైన డబల్ రోడ్డు నిర్మాణములో మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి నుండి జగదాంబ తండా, సిద్దాపూర్ గ్రామము నుండి కుర్తి గేటు వరకు ఫారెస్ట్ అధికారుల అడ్డు తగలడంతో పనులు నిలిచిపోయాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం 7 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు చేసింది. అటవీశాఖ అధికారులు క్లియరెన్స్ రాకపోవడంతో మిగిలిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయలేకపోయాం.

ప్రాసెస్‌లో ఉంది..

పిట్లం అటవీశాఖ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్

మండల కేంద్రంలోని మద్దెల చేర్వు నుండి జిల్లా సరిహద్దు గ్రామమైన తిమ్మానగర్ నల్ల వాగు బ్రిడ్జ్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో బ్రహ్మంగారి గుడి నుండి జగదాంబతండా, సిద్దాపూర్ కుర్తి గేటు వరకు పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వ హయములో అటవీ శాఖ నుండి ఎలాంటి క్లియరెన్స్ రాలేదు. ప్రస్తుతం ప్రాసెస్‌లో ఉంది.

కుర్చీల వితరణ


కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-సిరికొండ
మండలంలోని గడ్కోల్ గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు 2009-2010 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు 35 కుర్చీలను గురువారం వితరణ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని, అనుకున్న లక్ష్యాలను సాధించేవరకు కష్టపడి చదువుకోవాలని పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెమ్ ప్రశాంత్, భూక్య గణేష్, భూక్య శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శ్రీ భాషిత పాఠశాలలో గజ్జె పూజ మహోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని శ్రీభాషిత పాఠశాలలో విద్యార్థులకు క్లాసికల్ డాన్స్ తరగతులు నేపథ్యంలో గురువారం గజ్జపూజ మహోత్సవాన్ని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ శ్రీ పోలపల్లి సుందర్ మాట్లాడారు. మహోత్సవంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, నటరాజ నృత్యానికి వ్యవస్థాపకులు మాడవేటి నారాయణ, క్లాసికల్ డాన్స్ గురువు బాశెట్టి మృణాళిని, పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ నగదు తరలిస్తే లెక్కలు చూపాలి

- రూ.50 వేలకు మించి నగదు, బంగారం తరలిచొద్దు : కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచన
- జిల్లాలో గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్టు వెల్లడి


యాభై వేలు నగదుతో పట్టుబడిన వారిని విచారిస్తున్న అధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పార్లమెంట్ ఎన్నికల-2024 నియమావళి అమలులోకి వచ్చిన సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పోలీస్, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్ టీమ్స్ తనిఖీలు నిర్వహిస్తున్నాయని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఈ తనిఖీలలో రూ.50,000 కంటే ఎక్కువ నగదు కానీ, బంగారం, వెండి కానీ ఉండి సరైన ఆధారాలు చూపకుంటే, తనిఖీ అధికారులు ఆ డబ్బులను, వస్తువులను జప్తు చేస్తారని అన్నారు. తనిఖీల్లో జప్తు చేసిన నగదు, బంగారం, వెండి వస్తువులు రూ.10 లక్షలకు లోబడి ఉండి, తగిన ఆధారాలు చూపిన పక్షంలో వాటిని విడుదల చేయడానికి జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ (డీ.జీ.సీ)ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీకి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా వ్యవహరిస్తారని, సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, జిల్లా కోశాధికారి జిల్లా గ్రీవెన్స్ కమిటీ పని చేస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వివరించారు. రూ.పదిలక్షల లోపు నగదు లేదా బంగారం, వెండి వస్తువులకు సంబంధించిన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలించి, అన్నీ సక్రమంగా ఉన్న వాటిని విడుదల చేస్తుందన్నారు. ఒకవేళ జప్తు చేయబడిన నగదు, బంగారం, వెండి ఇతర వస్తువుల విలువ రూ. 10,00,000 మించి ఉంటే ఈ కమిటీ ఆ వివరాలను పరిశీలన కోసం ఆదాయపు పన్ను విభాగం నోడల్ అధికారికి పంపుతుందని తెలిపారు. వారి పరిశీలన రిమార్కుల ప్రకారం తనిఖీల్లో రూ.పది లక్షలకు మించి పట్టుబడిన నగదు, బంగారు, వెండిని విడుదల చేస్తారని వివరించారు. కాగా జిల్లాలో నేటి వరకు మూడు కేసులు నమోదు చేయనైనదని తెలిపారు. ఇందులో ఒక కేసు రూ.50,000ను తగిన ఆధారాలు చూపించినందున డీజీసీ కమిటీ ఆ మొత్తాన్ని విడుదల చేసిందన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎవరు కూడా రూ.50,000ల నగదు కంటే ఎక్కువ డబ్బులు కానీ బంగారం, వెండి వస్తువులతో ప్రయాణించకూడదని సూచించారు. ఒకవేళ తెలియక ప్రయాణించిన తనిఖీలలో డబ్బులు, బంగారం, వెండి వస్తువులు కానీ జప్తు చేయబడితే ఆందోళన చెందకుండా సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా గ్రీవెన్స్ కమిటీనీ (కలెక్టర్ కార్యాలయం)లో నోడల్ అధికారి పల్లె పాపయ్య, డిప్యూటీ రిజిస్ట్రార్, కోఆపరేటివ్, నిజామాబాద్ (సెల్ నెం.7997590472)ను సంప్రదించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికి గుర్తింపు

- బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నాయకులు


ఈరవత్రి అనిల్‌కు సన్మానం

నవతెలంగాణ-బాల్కొండ
బాల్కొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించబడిన ఈరవత్రి అనిల్‌కు ఘనంగా సన్మానించారు. గురువారం మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో ఈరవత్రి అనిల్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించిందని ఆనందం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా అనిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో శ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించే హోమం ఇతర ఏర్పాట్లను పరిశీలించి ఆలయ సభ్యులను అభినందించారు. ఆలయాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాజేష్, ఉమ్మెడ రాజేశ్వర్, కోటార్మూర్ పెద్దరాజేశ్వర్, కె.రాజేందర్, రవిచంద్ర, రాజేశ్వర్, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈరవత్రి, మానాలను కలిసిన పలువురు కాంగ్రెస్ నాయకులు


మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్
కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌ను గురువారం ఉదయం వారి వారి నివాసాలలో ముప్కాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముప్కాల్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మగ్గిడి ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ (మైనింగ్) కార్పొరేషన్ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ పదవులు రావడంతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్టు తెలిపారు. వారిని కలిసిన వారిలో షరీఫ్, సంజీవ్, రాజు తదితరులున్నారు.

ఖచ్చితంగా ఓటు వేయండి

- నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్
- ఉత్సాహంగా సాగిన 5కే రన్



5కే రన్‌లో పాల్గొన్న ఆర్డీఓ రాజేంద్రకుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఓటు హక్కు ఉన్నవారు ఖచ్చితంగా ఓటు వేయాలని నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్ అన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వీలుగా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం 'ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో నిర్వహించిన 5కే రన్ ఉత్సాహంగా సాగింది. వివిధ వర్గాల వారు స్వచ్ఛందంగా 5కే రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణితి చాటారు. కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్లు వెంకట్రావు, ప్రభాకర్, ఎస్ఐ మనోజ్‌కుమార్, రెవెన్యూ మండల అధికారులు, వివిధ శాఖల అధికారులతో పాటు డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లాభాల బాటలో దూపల్లి సొసైటీ

- సొసైటీ చైర్మన్ శేషు గారి భూమారెడ్డి


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్‌శేషు గారి భూమారెడ్డి

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని దూపల్లి సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతుల సహాయ సహకారాలతో లాభాల బాటలో ముందుకు సాగుతుందని సొసైటీ చైర్మన్ శేషుగారి భూమారెడ్డి స్పష్టం చేశారు. గురువారం సంఘం సొసైటీ ఆవరణలో పిఎసిఎస్ అధ్యక్షులు ఎస్.భూమారెడ్డి అధ్యక్షతన మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ అందించనున్నందున, రైతుల వద్ద అప్పులను బలవంతంగా వసూలు చేయవద్దని సిబ్బందిని ఆదేశించారు. మార్చ్ మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఎండబెట్టి సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని ఆయన సూచించారు. దూపల్లి సొసైటీ పరిధిలో ప్రస్తుతం 88 లక్షల రూపాయల లాభాలలో ఉందని, 11 లక్షల రూపాయలతో నూతన భవన నిర్మాణానికి భూ స్థలాన్ని కొనుగోలు చేశామని ఆయన పేర్కొన్నారు. అందరి సహాయ సహకారాలతోని తమ సొసైటీ లాభాల బాటలో కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు గత ఆరు నెలల జమ ఖర్చుల గురించి సీఈవో జీవన్‌రెడ్డి సంఘం సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పల్లె సాయిలు, ధనుర్ గంగాధర్, కూనపల్లి రాజిరెడ్డి, ప్రతాపరెడ్డి, గైని గోపాల్ గంగారం, నీరడి రవికుమార్, రామ్‌రెడ్డి, సాయమ్మ శ్రీమతి ముళ్ళపూడి వరలక్ష్మి, కార్యదర్శి జీవన్‌రెడ్డి, సెల్ స్మెల్ ఎల్.సాయన్న ప్రతాపరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పది జీవ శాస్త్రం పరీక్ష పూర్తి

- 48 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పదవ తరగతి పరీక్షలలో ప్రశాంతంగా జీవ శాస్త్రం పరీక్ష నిర్వహించినట్టు జిల్లా విద్యాధికారి ఎన్వి దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా కొనసాగిందని, జిల్లా మొత్తం 141 పరీక్ష కేంద్రాలలో 22,024 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 21,976 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై 48 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు డీఈవో 06 పరీక్ష కేంద్రాలను, డిస్ట్రిక్ట్ లెవెల్ అబ్జర్వర్ 05 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 27 పరీక్ష కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ఏ ఒక్కరు పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా హాజరు కాలేదని, ప్రతి పరీక్ష కేంద్రంలో సెట్టింగ్ స్క్వాడ్స్ 141 మంది విధులు నిర్వహించారని అన్నారు.

సొసైటీలో అవకతవకలపై డీసిఓకు ఫిర్యాదు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని కోనాసముందర్ సింగిల్ విండోలో జరిగిన అవకతవకలపై స్థానిక రైతు కమిటీ సభ్యులు గురువారం జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి, కార్యదర్శి రాజేశ్వర్‌ను బాధ్యులను చేస్తూ వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయి విచారణ చేసి వాడుకున్న నిధులను రికవరీ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. రైతు కమిటీ సభ్యుల ఫిర్యాదుపై స్పందించిన డిసిఓ శ్రీనివాస్ సింగిల్ విండోలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని హామీ ఇచ్చినట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. నిందితులు ఎవరైనా వదిలిపెట్టేది లేదని స్పష్టంగా డిసిఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో సామ ప్రతాప్‌రెడ్డి, దూర్శనం జనార్ధన్, చెలిమెల గంగాధర్, చెంగల అశోక్, బలేరావు శంకర్, గ్రామ రైతులు సామ భూమారెడ్డి, జైడి శ్రీనివాస్, బద్దం గంగారెడ్డి, బలేరావు గంగారెడ్డి, పేరం సుధాకర్, సుర సంజీవ్, బలేరావు ప్రశాంత్, బద్దం బాపురెడ్డి, కొండా నరేష్ తదితరులున్నారు.

భగత్‌సింగ్ ఆశయాలను ఆచరణలో ఉంచాలి

- ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు


మాట్లాడుతున్న మాధవరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పి.డి.ఎస్.యూ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా భగత్‌సింగ్ ఉద్యమించాడని, భగత్‌సింగ్ కోరికలను నేటి పాలకులు విస్మరిస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశ సంపదను కొద్దిమంది చేతుల్లో పెడుతున్నారని వివరించారు. ఇండస్ట్రీ సర్వీస్ సెక్టార్స్‌ను మొత్తం కూడా ప్రైవేట్ పరం చేస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు భగత్‌సింగ్ ఆశయాలను ఆచరణలో ఉంచాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.సరిత మాట్లాడుతూ.. భగత్‌సింగ్ 23వ సంవత్సరాల వయస్సులో దేశం గురించి ఆలోచించాడని, కానీ నేడు యువత చెడు మార్గంలో ప్రయాణిస్తున్నారని చెడుకు దూరంగా ఉండాలని, సమాజ మార్పు కోసం ఆలోచించి పని చేయాలని అన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, యూనివర్సిటీ కార్యదర్శి జయంతి, యూనివర్సిటీ నాయకులు మోహిత్, ప్రిన్స్, దేవిక, రవీందర్, అక్షయ్, ఆకాష్, బిందు, లహరి, నితీన్‌తో పాటు యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు సంహిత ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి
మండలంలోని ధర్మారం బి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థిని సంహితను ప్రిన్సిపాల్ సంగీత గురువారం అభినందించారు. ఈ నెల రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రతిభను కనబరిచి విజయానికి ముఖ్య పాత్ర పోషించారని పేర్కొన్నారు. జాతీయస్థాయికి 29 నుంచి 1 వరకు మహారాష్ట్రలో నిర్వహించే సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటుందని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఈటీ జోష్న, పాఠశాల సిబ్బంది పాల్గొని అభినందించారు

భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు

నవతెలంగాణ-బోధన్
రెంజల్ మండలంలోని నీలా గ్రామానికి చెందిన చికెన్ సెంటర్ వ్యాపారి పిల్లోల దేవోజీ తన భార్యను చంపిన కేసులో నేరం నిరూపితమవడంతో గురువారం బోధన్ ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్, నిందితుడు దేవోజీకి జీవితఖైదు విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

రెంజల్ మండలంలోని నీలా గ్రామానికి చెందిన చికెన్ వ్యాపారి పిల్లోల్ల దేవోజీకి మెదక్ జిల్లా నల్లవాగు గ్రామానికి చెందిన మనూబాయితో వివాహమైంది. కొన్నాళ్లు వైవాహిక జీవితం బాగానే ఉన్నా మనస్పర్థాలు రావడంతో ఆమె మొదటి కాన్పు కోసం పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మనూభాయి భర్తపై కేసు పెట్టింది. కేసు నడుస్తుండగా దేవోజీ విజయ అను మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. కేసు నడుస్తుండగా మనూబాయి, దేవోజీ మళ్లీ కలిసిపోయారు. ఆమె తిరిగి భర్త దగ్గరకు వచ్చింది. అంతా కలిసి జీవిస్తున్న సమయంలో మనుబాయి మళ్లీ గర్భం దాల్చి ఆమె రెండో కుమారుడుకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవలు మొదలవడంతో మరోసారి పుట్టింటికి వెళ్లిపోయి పోలీసు స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. అతనంతరం మధ్యవర్తుల ద్వారా మళ్లీ రాజీపడి భర్త దగ్గరకు వచ్చింది. ఈ విషయంలో భార్యపై కోపం పెంచుకున్న దేవోజీ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చికెన్ కొట్టే కత్తితో 2021 మే 3న భార్య గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం పోలీసుల ఎదుట లొంగిపోయి నేరం అంగీకరించాడు. ఈ మేరకు అప్పటి బోధన్ రూరల్ సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మురళి కేసు నమోదు చేశారు. ఘటనపై సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాంరావు ఈ కేసులో వాదనలు వినిపించారు. ఈ మేరకు సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితుడికి జీవితఖైదు విధిస్తూ రూ.వెయ్యి జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. లైజనింగ్ అధికారి శంకర్ ఈ మేరకు వివరాలు తెలిపారు. కోర్టు పోలీసు సిబ్బంది రాములు మనోహర్, ఇన్‌స్పెక్టర్ కోల నరేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ సాయన్న కేసుకు సహకరించారు.

రేపటి నుంచి ఇందూర్ తిరుమల బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-మోపాల్
మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామంలోని ప్రముఖ ఇందూరు తిరుమల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నరసింహారెడ్డి తెలిపారు. శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మార్గదర్శంలో శ్రీ శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి, అహోబిల రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో వారం రోజులపాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ నెల 30వ తేదీ శనివారం సాయంత్రం ఉత్సవాల అంకురార్పణ, ఆదివారం ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ శేష వాహన సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం ఉత్సవమూర్తులకు సూర్యప్రభ చంద్రప్రభ, గజవాహన సేవలతో ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం ఉదయం దేవదేవుల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో నరాల సుధాకర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో యువకులే ముఖ్య పాత్ర పోషించాలి

- నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి


జీవన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇబ్రాన్‌పల్లి
పార్లమెంటు ఎన్నికల్లో యువకులే ముఖ్యపాత్ర పోషించాలని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జగిత్యాల జిల్లాలో నిజామాబాద్ పార్లమెంట్ ప్రజల ఆశయాల సారథి తాటిపర్తి జీవన్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించినందున గురువారం వారి నివాసంలో పూలబొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్టు ఇబ్రాన్‌పల్లి యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ ఎలక్షన్లలో యువకులే ముఖ్య పాత్ర పోషించాలని, తన విజయానికి బాసటగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు సోప్పరి వినోద్, మాల మహానాడు యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్ అనుపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కనుక సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మట్టెలు వితరణ



పుస్తె మట్టెలు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన బొల్లిగద్ద సుగుణ నర్సింలు మూడో కూతురైన మనసా (రోజా) వివాహం తాడ్వాయి మండలం కరడ్ పల్లి గ్రామానికి చెందిన గని మహేందర్‌తో నిశ్చయమయింది. నేడు వివాహం జరగనుండగా.. వధువు కుటుంబీకులకు వైస్ ఎంపీపీ ఊరుదొండ నరేష్ తన వంతు సాయంగా పుస్తె మట్టెలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న మల్లారెడ్డి ఎంపీటీసీ రాజు, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుతారి సుధాకర్, కుటుంబ సభ్యులు రాములు, కవిత, నరేష్ లు పుస్తె మట్టెలు అందించిన ఊరుదొండ నరేష్ కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లపై మురుగునీరు



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మల్లూరు గ్రామంలో డ్రైనేజీలలో చెత్తాచెదారం చేరి మురుగునీరు మొత్తం డ్రైనేజీలలో నిండి రోడ్లపై పారుతున్నాయు. పొద్దున పూట సేకరించిన పొడి చెత్తను కంపోస్ట్ షెడ్డుకు తరలించకుండా రోడ్డు పక్కనే పారవేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయ. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి కి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలుమార్లు గ్రామానికి సంబంధించి శానిటేషన్ శుభ్రతపై సమీక్ష నిర్వహించినా కొందరు పంచాయతీ కార్యదర్శులు మాత్రం పట్టనట్టు ఉన్నట్టు ఆరోపనలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో చెత్తచెదారం లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కెమికల్ కంపెనీలపై..

తనిఖీలు నామమాత్రమే

- వాయు, భూమి, నీరు కాలుష్యమవుతున్నా పట్టని అధికారులు
- ఆస్తమా, జలుబు శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్న స్థానికులు
- పీహెచ్‌సీలో ఇవే సమస్యలపై వస్తున్న రోగులు

నవతెలంగాణ-భిక్కనూర్

ఒక్క కెమికల్ కంపెనీ కారణంగా గాలి, నీరు పొల్యూట్ అవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రజల ప్రాణాల కన్నా.. కంపెనీకే ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కెమికల్ కంపెనీల రసాయనాలు రాత్రి వేళల్లో గాల్లోకి విడుదల చేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు వాపోతున్నా. సంబంధిత పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, భూగర్భ జలాల అధికారి, మెడికల్ అధికారుల్లో కనీసం చలనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని ఎక్కడా లేని విధంగా భిక్కనూరు మండలంలో విచ్చలవిడిగా కెమికల్ కంపెనీలు ఏర్పాటు చేశారు. ఈ కెమికల్ కంపెనీల కారణంగా గాలి, నీరు పొల్యూషన్ కావడమే కాకుండా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. గత కొంతకాలంగా భిక్కనూరు పట్టణ వాసులు, సమీపంలో నివసిస్తున్న గ్రామాల ప్రజలు అర్ధరాత్రి వదులుతున్న కెమికల్ వాసన కారణంగా దగ్గు, జలుబు, తీవ్ర జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఆస్తమాతో బాధపడుతున్న వృద్ధులకు ఊపిరాడకుండా చేస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తనిఖీలు చేసినా కాలుష్యం ఎందుకు..?

ఎప్పటికప్పుడు కెమికల్ కంపెనీలపై తనిఖీలు చేస్తున్నామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు పేర్కొంటుడటం గమనార్హం. అయితే రాత్రి సమయాలలో ఎందుకు విపరీతంగా కెమికల్ వాసన వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిజంగానే పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు వచ్చి తనిఖీలు చేస్తున్నారా..? తూతూ మంత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారా అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం సమయంలో వచ్చి తనిఖీలు చేయడం కంటే రాత్రి సమయంలో తనిఖీలు చేస్తే ప్రజల బాధ అర్థం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ జలాలు కాలుష్యం..

కెమికల్ కంపెనీల కారణంగా భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా ఎప్పటికప్పుడు జిల్లా భూగర్భ జలాల అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ముఖ్యంగా కెమికల్ కంపెనీలు ఉన్నచోట తనిఖీలు చేసి భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. కంపెనీ సమీపంలో భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు. కానీ ఇప్పటి వరకు వచ్చి శాంపిల్లు సేకరించి ల్యాబ్‌కు పంపించి పరిక్షించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సంవత్సరానికి రెండు సార్లు తనిఖీలు చేస్తాం

రెడ్ క్యాటగిరిలో ఉన్న కెమికల్ కంపెనీలను సంవత్సరానికి రెండుసార్లు తనిఖీలు చేస్తాం. తనిఖీలు చేసి జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తాము. పది రోజుల్లో కెమికల్ కంపెనీలపై తనిఖీలు చేసి కెమికల్ పొల్యూషన్ ఎక్కువగా ఉంటే కంపెనీలపై చర్యలు తీసుకుంటామన్నారు.

లమన్ ప్రసాద్ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి)

దగ్గు జలుబుతో బాధపడుతున్న ప్రజలు..

అర్ధరాత్రి సమయంలో అందరూ నిద్రపోతున్న తర్వాత కెమికల్ కంపెనీ నుండి వెదజల్లుతున్న కెమికల్ వాసన కారణంగా గ్రామాలలోని ప్రజలు దగ్గు జలుబుతో బాధపడుతున్నారని, కొందరికి తీవ్ర జ్వరం, ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న వారికి ఊపిరి ఆడకుండా చేస్తున్నాయని, మరికొందరికి గొంతు ఇన్ఫెక్షన్ జరుగుతుందని సమాచారం.

పైజో మీటర్ ద్వారా తనిఖీలు చేస్తున్నాం

భూగర్భ జలాలు కాలుష్యం కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. పైజో మీటర్ కొన్ని గ్రామాలలో ఏర్పాటు చేశాము. భూగర్భ జలాలు కాలుష్యం అవుతే కలెక్టర్ కు నివేదిక అందజేస్తాము. సంవత్సరానికి రెండుసార్లు ఏప్రిల్, మే నెలలో తనిఖీలు చేసి నివేదిక సమర్పిస్తాము.

-సతీష్ (భూగర్భ జలాల అధికారి)

గాయాలు, దురదతో బాధపడుతున్న కార్మికులు..

కెమికల్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు తరచూ ప్రమాదాల బారిన పడి గాయాలపాలువుతుండటంతో పాటు దురదతో బాధపడుతున్నారని కంపెనీలో పని చేస్తున్న కార్మికులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వారానికి ఐదుగురు కెమికల్ కంపెనీలో పనిచేసి దెబ్బలు తగిలించుకొని, కాళ్లు చేతులు దురదతో బాధపడుతున్న కేసులు నమోదవుతున్నాయని ప్రభుత్వ వైద్యులు తెలిపారు. ఏది ఏమైనప్పటికీ కెమికల్ కంపెనీల కారణంగా భవిష్యత్తులో ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉంటాయని ఇటు ప్రజాప్రతినిధులు కానీ అటు కంపెనీ యాజమాన్యాలు కానీ ప్రజలకు ఎలాంటి భరోసా ఇవ్వలేకపోతున్నారు. యంత్రాలు చేసే తప్పులు ఎవరు ఆపలేరని ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటామని తూతూ మంత్రంగా తెలియజేయడమే తప్ప ఎలాంటి భరోసా ఇవ్వలేకపోతున్నారు.

ప్రభుత్వాసుపత్రికి కంపెనీ రోగులే ఎక్కువ

ప్రభుత్వ ఆసుపత్రిలో కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు దెబ్బలు తగలడం, కెమికల్ కారణంగా చేతులు కాళ్లు దురద వస్తుందని భాద పడుతున్నవారు ఎక్కువగా వస్తున్నారు. దగ్గు, జలుబు బాధపడుతున్న వారికి ఎందుకు వస్తుందో పరిశీలిస్తామని తెలిపారు.

యేమిమా (భిక్కనూరు ప్రభుత్వ వైద్యాధికారి)

బాధితులకు నిత్యావసరాలు అందజేత



రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసరాల సరుకులు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోయి సర్వస్వం కోల్పోయిన ఖండేబల్లూర్ గ్రామానికి చెందిన బొట్టి శాంతాబాయి మారుతి కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జుక్కల్ శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు.

అగ్ని ప్రమాదం జరిగేటప్పుడు నలుగురు పిల్లలు తల్లి గుడిసెలో పడుకుని ఉన్నారు. తండ్రి కెనాల్ వాటర్ పొలానికి నీరు పెట్టడానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఈ సంఘటన జరిగింది. ఆ మంటల వేడిని చూసి పిల్లవాడు నిద్రలేచి అరుపులు మొదలు పెట్టేసరికి చుట్టుపక్కల వారు చుట్టూ ఉన్నటువంటి తుంగ కట్టెలను జరిపేసి వాళ్ళని కాపాడారు. గురువారం నాడు ఐ ఆర్ సి ఎస్ తరపున వారి కుటుంబానికి కిచెన్ సామాగ్రి దుప్పటి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దస్థిరాం సార్. రెడ్ క్రాస్ చైర్మన్ డోంగ్లే ఉమాకాంత్, చంద్రకాంత్ సెట్, సాయినాథ్, పండరి, వెంకట్ గౌడ్ గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు



రక్తదానం చేస్తున్న యువకుడు

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థి దశ నుంచే సేవా భావనను పెంపొందించుకోవాలని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలుర)లో గురువారం ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్ (ఐవిఎఫ్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కామారెడ్డి రక్తదాతల సమూహం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించరు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని సేవా భావనను పెంపొందించు కోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రక్త నిల్వలు లేకపోవడం వల్ల వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణీస్త్రీలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారి కోసమే ఈ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ రక్తదాన శిబిరానికి సహకరించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మండల రామలక్ష్మిని సన్మానించరు. ఈ రక్తదాన శిబిరంలో భాగంగా 27 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, నవీన్, కామారెడ్డి రక్తదాతల సమూహ ఉపాధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, టెక్నీషియన్లు అమర్‌నాథ్, అరుణ్, నవీన్, పోశెట్టిలు పాల్గొన్నారు.

సురేశ్ షెట్కార్‌ను ఎంపీగా గెలిపిద్దాం



మండల అధ్యక్షున్ని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

కాంగ్రెస్ మండల అధ్యక్షునికి పలు గ్రామాల్లోని పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు సన్మానం చేపట్టారు. మండల అధ్యక్షులుగా ఎన్నికైన వజ్రఖండి మాజీ సర్పంచ్ సంజీవ్ పటేల్‌ను ఎమ్మెల్యే క్యాంపు గ్రామాల కార్యకర్తలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఖండభల్లూర్, గుండూర్, మధురాతాండా మాజీ రాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు క్యాంపు కార్యాలయానికి తరలి వచ్చారు. పార్టీ అధ్యక్షుడు సంజీవ్ పటేల్ మాట్లాడుతు జుక్కల్ ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావ్ సహకారంతో గ్రామాలలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి, పార్టీ బలోపేతానికి, పటిష్టతకు కృషి చేస్తానని, మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించి నాయకులను కలిసి రాబోయే పార్ల మెంట్ ఎన్నికలలో అందరం కలిసి ఎమ్మెలే ఆదేశాలతో ఎంపీగా సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుండూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మారుతీ పటేల్, నాయకులు ప్రకాశ్ పటేల్, మారుతీ పటేల్, సంజీవ్ పటేల్, సంజీవ్ , బాబు, కార్యకర్త ప్రసాద్ , ఖండేబల్లూర్ గ్రామనాయకులు రాజేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వారు తర్వాత వీరు..

- యథేచ్ఛగా మొరం తవ్వకాలు

నవతెలంగాణ-భిక్కనూర్

44వ జాతీయ రహదారిపై యథేచ్ఛగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నా ఇటు మైనింగ్ అధికారులు అటు రెవెన్యూ అధికారులు ఎక్కడ కూడా మొరం తవ్వకాలపై నిఘా ఏర్పాటు చేసి సీజ్ చేసిన దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో అంతంపల్లి గ్రామంలో అర్ధరాత్రి సమయంలో అక్రమ మొరం తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా, ఎన్ని వినతి పత్రాలు అందజేసినా అక్రమ మొరం దందా ఆగడం లేదు.

గత ప్రభుత్వ కాలంలో ఆ పార్టీకి చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు జోరుగా అక్రమ మొరం దందాలకు పాల్పడితే ప్రస్తుత అధికార పార్టీ నాయకులు వ్యతిరేకించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు జోరుగా మొరం దందా సాగుతుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సైతం ఎందుకు స్పందించడం లేదని వాదనలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చోరీకి పాల్పడ్డ నిందితుడి రిమాండ్

- ఒక్కరోజులోనే చోరీ కేసు చేధించిన పోలీసులు

నవతెలంగాణ-మద్నూర్

తాళం వేసిన ఇంట్లో చోరికి పాల్పడ్డ నిందితుడిని పోలీసులు ఒక్కరోజులేనే అరెస్ట్ చేసి నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణగౌడ్ గురువారం బాన్సువాడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మద్నూర్ గ్రామంలో గల మహాజన్ బాలాజీ అనే వ్యక్తి ఇంట్లో తేదీ ఈ నెల 26వ తేదీనా రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి చోరీకి ఘటన చోటుచేసుకుంది. బీరువాలో నుంచి 15 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల బిస్కెట్ బంగారం, 16,000ల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. 27వ తేదీనా బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా.. మద్నూర్ గ్రామానికి చెందిన ఉప్పరివార్ శ్రీను (32) చేతిలో సంచి పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అతడని పట్టుకొని పోలీసులు తమదైన శైలీలో విచారణ చేపట్టారు. కొన్ని రోజుల నుండి మద్యం తాగుడుకు అలవాటు పడి చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ దొరికిన వాటిని అమ్ముకుంటు ఖర్చు చేస్తూ ఉండేవాడు. ఆలా ఏదైనా దొంగతనం చెయ్యాలనే ఉదేశ్యంతో గత వారం రోజుల నుండి మహాజన్ ఇంటి వద్ద రెక్కి చేస్తూ, అతడు బయటకు వెళ్లిన సమయం లో ఇంటితాళం పగులగొట్టి బీరువా లో నుండి బంగారు ఆభరణములు దొంగతనం చేసినటుట నేరం ఒప్పుకున్నాడు. అంతే కాకుండా మూడు నెలల క్రితం బాగన్న మఠం మద్నూర్ కు సంబంధించిన షేటర్స్‌లో రేకులు నుండి లోపలకు దిగి గల్లా పెట్టేలో నుండి నగదు చోరీ చేసినట్టు తెలిపారు. అతడు దొంగలించిన బంగారం బిస్కెట్ 10 తులాలు, 15 తులాల బంగారు ఆభరణాలు, 16000 రూపాయలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అందజా మొత్తం 13,31,000/- వరకు ఉంటుం ది. నిందితుడిని గురువారం రిమాండ్‌కు పంపించారు. ఒక్క రోజులోనే చోరీ కేసు చేధించిన ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్‌ను, పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు.



చోరి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

వృద్ధుడు అదృశ్యం



నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని లింగాయపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం మైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు గురువారం తెలిపారు. లింగాయపల్లి గ్రామానికి చెందిన తొట్టు భూమయ్య (70) ఈ నెల 11న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదని, తాము వెతికిన అతని ఆచూకీ లభించలేదని ఆయన కూతురు మమత గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే ఈ క్రింది నంబర్స్‌కి, కామారెడ్డి రూరల్ సీఐ 8712686148. దేవునిపల్లి ఎస్సై 8712686150 తెలియజేయాలనీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మానసిక రోగులకు చికిత్స, అవగాహన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మానసిక రోగులకు చికిత్స, అవగాహన కార్యక్రమాన్ని వైద్యులు సురేష్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు రమణ, మానసిక ఆరోగ్య సామాజిక కార్యకర్త రాహుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... మానసిక సమస్యలను వ్యాధిగ్రస్తులు చికిత్స తీసుకోవాలని, వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మతిమరుపు, నిద్రలేమి, అతి నిద్ర, ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలు,- అతి కోపం, మద్యపానం, ధూమపానం వంటి మానసిక అనారోగ్యంతో ఉన్నవారికి చికిత్స అందిస్తామని, మానసికంగా ఆరోగ్యం కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. మానసిక రోగులకు చికిత్సతో పాటు కౌన్సిలింగ్ కూడా అందిస్తామని, నేరుగా వైద్యులను సంప్రదించాలని, లేదా ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14 416 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భీమ్, జానకి, రాజు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 31 నాటికి

100 శాతం పన్నులు వసూలు చేయాలి

- ఎల్లారెడ్డి డిఎల్పివో సురేందర్



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మార్చి 31 కెల్లా గ్రామాల్లో 100 శాతం పన్నులు వసూలు చేయాలని ఎల్లారెడ్డి డిఎల్పివో సురేందర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం మార్చి 31న ముగుస్తున్నదున పన్నులు వసూలు చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో వాటర్ ట్యాంక్ లో క్లోరినేషన్ మురికి కాలువల పరిశుభ్రత తదితర అంశాలపై పంచాయతీలకు పలు సూచనలు సలహాలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో పర్బన్న. ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని అన్ని గ్రామాలను మౌళికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ నాయకుల ముఖ్య ఉద్దేశం అని జుక్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ పటేల్ అన్నారు. గురువారం మండలంలోని ఖండేబల్లూర్ గ్రామములో ఉపాదీహామీ పథకంలో బాగంగా రూపాయలు ఐదులక్షల వ్యయం తో జుక్కల్ ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావ్ సహకారంతో సిసి రోడు పనులను మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు సంజీవ్ పటేల్ మాట్లాడుతూ ఎమ్మెలే సహకారంతో గ్రామాలలో మంచి ప్రతిష్టను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ మండల మాజీ ఎంపిపి లక్ష్మన్ పటేల్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్ వార్ వినోద్, నాయకులు లక్షెట్టి సాయులు, కృష్ణ, రాజేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి బయోసైన్స్ పరీక్ష ప్రశాంతం

నవతెలంగాణ- కామారెడ్డి/రామారెడ్డి

జిల్లా వ్యాప్తంగా గురువారం బయోసైన్స్ ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం పరీక్షలు నిర్వహించగా 11962 హాజరు కావలసి ఉండగా, 11938 మంది విద్యార్థులు హాజరయ్యారు. 24 మంది గైర్హాజర్ అయ్యారని, ప్రైవేట్‌గా రాస్తున్న 10 మంది విద్యార్థులకు గాను 9 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రామారెడ్డి : మండలంలో 10వ తరగతి బయో సైన్స్ పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉప్పల్వాయి సెంటర్లో 153 మంది విద్యార్థులకు గాను 153 మంది, రెడ్డి పేటలో 165 మందికి 165 మంది విద్యార్థులు, రామారెడ్డి లో 185 మంది విద్యార్థులకు గాను 184 మంది విద్యార్థులు హాజరై ఒకరు గైహాజరైనట్లు మండల విద్య శాఖ అధికారి యేసేఫ్ తెలిపారు.

ముగిసిన హరినామ సప్తహా



బోనాలతో తరలిన గ్రామస్తులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలో ఏడు రోజుల నుండి రాత్రి పగలు నిర్వహించిన హరినామ సప్త గురువారం ఘనంగా ముగించారు. ఏడు రోజులు అనేక గ్రామాల నుండి చాలామంది భజనకారులు వచ్చి సప్తలో పాల్గొన్నారు. గురువారం గ్రామంలోని ప్రజలందరూ కలిసి గోపాల కలువలతో గ్రామం మొత్తం ఊరేగింపుగా తిరిగి మధ్యాహ్నం సమయంలో కీర్తన చేసి అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేసి ముగింపు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భజన కారులు తదితరులు పాల్గొన్నారు.

568 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బొంకన్‌పల్లి గ్రామంలో ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి క్రాంతి పాల్గొని టీకాలు వేశారు. రైతులు తమ పశువులకు ఉచిత నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఉమామ సహేర్, విఏఎస్ వినిత, విఎల్‌ఓ గంగాజమున, జేవిఓ అహ్మద్ పాషా, విఏ సుధీర్, గోపాలమిత్ర సిబ్బంది జైలొసింగ్, వ్యాకినేటర్ శ్రీను, గంగాధర్, పుష్ప, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.


టీకాలు వేస్తున్న వైద్యులు

భేటి బచావో భేటి పడావోపై కళాజాత

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలో భేటి బచావో భేటి పడావోపై కళజాత బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. భేటి బచావో భేటీ పడావోపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఐసిడిఎస్ సునీత తెలిపారు. మండల కేంద్రంలో మహిళ శిశు దివ్యాంగుల, వయో వృద్ధులశాఖ పరిధిలో మహిళ సాధికారత కేంద్ర ఆధ్వర్యంలో భేటి బచావో భేటి పడావో కార్యక్రమాలను చేపట్టారు. ప్రొజెక్టర్ ద్వారా చిత్ర ప్రదర్శన ద్వారా బాల్య వివాహాలు, మహిళలపై హింసపై వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాకేష్, అంగన్‌వాడీ సిబ్బంది రజిత, నసీమ, అంజలి దేవి, భారతి గ్రామప్రజలు పాల్గొన్నారు.


కళాజాతలో పాల్గొన్న గ్రామస్తులు

క్షయ రహిత జిల్లానే మన లక్ష్యం

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్షయ రహిత జిల్లానే తమ లక్ష్యమని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా క్షయ నియంత్రణ విభాగం ద్వారా జిల్లాలో ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక నిజామాబాద్ పట్టణంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టిబి సిబ్బంది చేసిన సేవలకు గాను నిజామాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో అవార్డులు వచ్చాయన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్ జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చాలని, అందుకు మీరంతా నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. డిఎంహెచ్‌ఓ సుదర్శనం మాట్లాడుతూ జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్ జిల్లాలో 100శాతం నూతన కేసులు నమోదు కాకుండా క్షయ రహిత జిల్లాగా నిజామాబాద్‌ను మారుస్తామని తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి, చికిత్స, నియంత్రణ చర్యల గురించి తెలిపారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డివిజన్ల నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌ల వారీగా వైద్యాధికారులు, టీబీ నోడల్ పర్సన్, ఆశాలను అతిథుల చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రంతో సత్కరించారు. గత మూడు సంవత్సరాల నుంచి 2021లో కాంస్య పతకం, 2022లో వెండి పతకం, 2023లో బంగారు పతకం నిజామాబాద్ జిల్లాకు జాతీయస్థాయిలో రావడం ద్వారా హ్యాట్రిక్ సాధించడంతో ఆర్ఎన్టిసిపి విభాగం సిబ్బంది ముఖ్యంగా జిల్లా టిబి కోఆర్డినేటర్, డీపీపీఎం, ఎస్‌టిఎస్, ఎస్‌టిఎల్ఎస్, ఫార్మసిస్టులు, రేడియో గ్రాఫర్, ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందిని అందరినీ ప్రశంసాపత్రాలతో సన్మానించారు. అదేవిధంగా జిల్లాలో గతంలో టీబీ వ్యాధికి గురై టీబీ చికిత్సను విజయవంతంగా పూర్తిచేసి టిబి రహిత వ్యక్తిగా మారిన టీబి చాంఫియన్స్‌గా మారిన వారిని ఈ సందర్భంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విద్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ డీఎల్ఎన్ స్వామి, పిఓడిటి డాక్టర్ నాగరాజ్, డిఐఓ డాక్టర్ అశోక్, ప్రైవేటు పల్మనాలజిస్టు డాక్టర్ రాజేశ్వర్, ఉదయ్ కృష్ణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

పోరుబాటకు ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త హాజరుకావాలి

నవతెలంగాణ-భీంగల్

కాంగ్రెస్ ప్రభుత్వం వారికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భీంగల్ పట్టణ కేంద్రంలో చేపట్టే పోరుబాట కార్యక్రమానికి ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త, రైతుల తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నరసయ్య పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి వరికి మద్దతు ధర కల్పించడంతోపాటు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క కార్యకర్త భీంగల్ పట్టణ కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉదయం 10 గంటలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

- అడిషనల్ కలెక్టర్ అంకిత్


నీటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భీంగల్

గ్రామాలలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ మండల అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని తాళ్లపల్లి, రహత్‌నగర్ గ్రామాలలోని మినీ వాటర్ ట్యాంకులను, తాగునీటి పైప్‌లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. అంతకుముందుగా నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి అందుకు కావలసిన చర్యలను చేపట్టాలన్నారు. అలాగే నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీఓ గంగా మోహన్, ఏపీఓ నరసయ్య, ప్రత్యేక అధికారులు లక్‌పతి, దేవిదాస్, పంచాయతీ కార్యదర్శులున్నారు.

ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాజు

నవతెలంగాణ-ఆర్మూర్

ఓటర్లందరూ రాబోయే ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రెవెన్యూ డివిజనల్ అధికారి రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు ఓటర్లకు పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం మామిడిపల్లి చౌరస్తా నుంచి పట్టణ అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులచే 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్లు చైతన్యవంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బస్వారెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్, తహసిల్దార్ గజానన్, మండల విద్యాధికారి రాజగంగారాం, ఆర్ఐ అశోక్, జూనియర్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లి, కూనేపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


టీకాలు వేస్తున్న దృశ్యం


నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి, కూనేపల్లి గ్రామాలలో గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు పశు వైద్య అధికారి డాక్టర్ విట్టల్ పేర్కొన్నారు. ఈ రెండు గ్రామాలలో 382 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది నరేష్, లక్ష్మణ్, సావిత్రి, గోపాల్ మిత్ర భాస్కర్‌గౌడ్, యశ్వంత్, రైతు దేవదస్ (బుజ్జి సెట్) తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీ పట్టివేత

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని దోంచంద గ్రామ శివారులో గల గోదావరి నది నుంచి రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి పోలీసులకు అప్పజెప్పినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలకు వెనుకాడబోమని అన్నారు.



దళారులను నమ్మి మోసపోవద్దు

- ఎన్‌డిసిసిబి డైరెక్టర్ ఎన్ చంద్రశేఖర్ రెడ్డి
- బోర్గాం(పి) సొసైటీ సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మోపాల్

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఎన్‌డిసిసిబి డైరెక్టర్ ఎన్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని బోర్గం (పి) సహకార సంఘంలో గురువారం సహకార సంఘం చైర్మన్, ఎన్‌డిసిసిబి డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కచ్చితంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సొసైటీల ద్వారానే తమ ధాన్యాన్ని అమ్ముకొని సరైన ధరను పొందాలని ఆయన కోరారు. అలాగే క్వింటాకు రూ.500 ప్రభుత్వం అదనంగా ఇవ్వాలని, త్వరగా సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించే విధంగా తీర్మానం చేశారు. నూతనంగా ఎన్నికైన నిజామాబాద్ ఎన్డీసీసీ చైర్మన్ రమేష్ రెడ్డికి బోర్గం సహకార సంఘం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఈగ జయకృష్ణ, డైరెక్టర్లు బంటు గంగాదాస్, చామకూర రాజశేఖర్‌రెడ్డి, చామకూర మహేందర్‌రెడ్డి, నరేష్, ముత్యాల నారాయణ, కూచన్‌పల్లి బుజేందర్‌రెడ్డి, గాజుల సాయిబాబా, సహకార సంఘం సీఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

- ఏకగ్రీవ తీర్మానం


మాట్లాడుతున్న చైర్మెన్

నవతెలంగాణ-రెంజల్

ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నలకు ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేయాలని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గురువారం మండల కేంద్రమైన రెంజల్ సొసైటీ చైర్మన్ మొహీనుద్దీన్ అధ్యక్షతన మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధి పథంలో నడవడానికి కార్యవర్గ సభ్యులతో పాటు, రైతుల సహాయ సహకారాలతో ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతకుముందు సొసైటీ కార్యదర్శి రాము గత ఆరునెలల జరిగిన జమ ఖర్చులను సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అగ్గు నారాయణ, పోతరాజు గంగామని, ఎ.చంద్రకళ, మన్నె సావిత్రి, సొసైటీ కార్యదర్శి వై.రాము, సిబ్బంది ఇంతియాజ్, ఆర్.సాయిబాబా, మురళి కిషోర్, ఎల్.శ్రీనివాస్, సిహెచ్.హరీష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వన్ టైం సెటిల్మెంట్ గడువును పొడగించాలి


మహాజనసభకు హాజరైన పలువురు

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వం వన్ టైం సెటిల్మెంట్ గడువును పొడిగించాలని, రైతులు పండించిన పంట చేతికి రాకముందే ఈ నెలాఖరులోపు పూర్తవుతున్నందున మరింత గడువును పొడిగించాలని సింగిల్ విండో చైర్మన్ ఇమామ్ బేగ్ కోరారు. గురువారం మండలంలోని నీలా సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ ఇమామ్ బేగ్ అధ్యక్షతన మహాజనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి నెలలో సొసైటీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, రైతులందరూ సొసైటీ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు సొసైటీ కార్యదర్శి రాందాస్ గత ఆరు నెలల జమ ఖర్చులను, ఆస్తి హక్కుల పట్టికను, కార్యవర్గ సభ్యులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆకాష్, అబ్బాస్ బేగ్, లాయక్ అలీ, ఆఫీజ్, మదారి, కార్యదర్శి రాందాస్, శంకర్, హర్బాజ్, రాఘవేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



నవతెలంగాణ-భీంగల్

మండలంలోని పల్లికొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ఏశాల కృష్ణ బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు జై జై నర్సయ్య, కుంట రమేష్, పల్లె శేఖర్, కొరాడి రాజు, లింబాద్రి, మహిపాల్, రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్బవ్వ అనే ఆశావర్కర్ విధి నిర్వహణలో రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై ప్రాణాలను కోల్పోయిందని ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న అబ్బవ్వ మృతదేహాన్ని సందర్శించి, ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గైని రాజమణి మాట్లాడుతూ ఆశావర్కర్ల జీవితాలు గాలిలో దీపంలా మారాయని, జీవితాంతం ప్రజలకు సేవ చేసినా మా మరణానంతరం కనీసం మట్టి ఖర్చులకు కూడా ప్రభుత్వాల నుంచి నోచుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పని భారం మోపుతూ ఇబ్బందులకు గురిచేసినా తప్పని పరిస్థితులలో సేవలు అందిస్తున్నామని అయినా ఎటువంటి సామాజిక భద్రత లేకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు స్పందించి అబ్బవ్వ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్, నాయకులు ధ్యారంగుల కృష్ణ సైతం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.


ఆశావర్కర్ మృతదేహం


కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న నాయకులు

న్యాయ కళాశాల విభాగంలో ఎం.రాధాకృష్ణ చౌహాన్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ, న్యాయ కళాశాల విభాగంలో ఎం.రాధాకృష్ణ చౌహాన్‌కు గురువారం జరిగిన వైవా-ఓస్ కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ శివకుమార్ పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థి ఎం.రాధాకృష్ణ చౌహాన్ "న్యాయ నిర్వహణలో సాంకేతికకు సంబంధించిన చట్టాలు" అనే అంశంపై పరిశోధక గ్రంథాన్ని తెలంగాణ యూనివర్సిటీకి సమర్పించారు. ఈ మౌఖిక పరీక్షకు ప్రిన్సిపాల్ ఆఫ్ క్రీస్తు జ్యోతి కాలేజీ అఫ్‌లా, బెంగళూర్‌కు చెందిన ప్రొఫెసర్ మోహన్ రావుబొల్లా ఎక్స్‌టర్నర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధక విద్యార్థి ఎం.రాధాకృష్ణ చౌహాన్ తన పరిశోధనలో న్యాయ స్థానములలో త్వరితగతిన కేసులను పరిష్కరించే ప్రయత్నంలో సాంకేతికతను జోడించినప్పుడు వచ్చే సమస్యలకు సంబంధించిన చట్టాలు ఎలా ఉపయోగ పడతాయో, కొత్త చట్టాలు చెయ్యవలసిన అవశ్యకత గురించి, కొత్త సాంకేతికత ఉపయోగాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆకర్షణీయంగా వివరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి, ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, డీన్ న్యాయ కళాశాల డాక్టర్ స్రవంతి, ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్య, కాంట్రాక్ట్ అధ్యాపకులు పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.


డాక్టరేట్‌ను అందుకుంటున్న చౌహాన్

రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని మండలంలోని తాళ్లరాంపూర్ పీఏసీఎస్ సంఘం అధ్యక్షులు పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం సంఘం మహాజనను నిర్వహించారు. సంఘ కార్యదర్శి ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. అనంతరం సంఘం అధ్యక్షులు పెద్ద కాపుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు వారి అవసరాల నిమిత్తం తీసుకున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. వచ్చే నెలలో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్టు చెప్పారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతుధర పొందాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు సోమ దేవరెడ్డి, ఆడేం గంగాప్రసాద్, బడిగిరి సాయిరాం, వెంకయ్యగారి రవి, బద్దం రవీందర్, దేశబోయిన చిన్న సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోండి

- తహసీల్దార్ రేణుకచౌహాన్

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పొద్దు తిరుగుడు గింజల మద్దతు ధర కొనుగోలు కేంద్రాన్ని డోంగ్లి మండల తహసిల్దార్ రేణుక చౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొద్దుతిరుగుడు పంట రైతులు మద్దతు ధర కేంద్రాన్ని సద్వినియోగం పంచకోవాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు నాందేవ్, గజానంద్ సొసైటీ కార్యదర్శి రేంజర్లవార్ గంగాధర్, సింగిల్ విండో సిబ్బంది వీరేష్, ఇర్వంత్, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

సరిహద్దు చెక్‌పోస్ట్ సందర్శన

నవతెలంగాణ-మద్నూర్

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర సరిహద్దు మద్నూర్ మండలంలోని సలబత్ పూర్ సమీపంలో అంతరాష్ట్ర చెకింగ్ చెక్ పోస్ట్, కేంద్రాన్ని అలాగే జుక్కల్ చౌరస్తా లో బస్సును ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి శ్రీనివాస్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. పకడ్బందీగా ప్రతి వాహనం తనిఖీ చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మద్నూర్ తహసీల్దార్ ఎమ్‌డి ముజీబ్, ఆర్ఐ శంకర్ ఉన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఉన్నతాధికారి

కులవృత్తులకు అండగా ఉంటాం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా
- కులవృత్తులను ప్రోత్సహించాలి : జెడ్పీచైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు
- ఘనంగా మేదరి కులదైవం కేతేశ్వర స్వామి విగ్రహ ఆవిష్కరణ


కేతేశ్వరస్వామి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, అర్బన్ ఎమ్మెల్యే, జెడ్పీచైర్మెన్



అర్బన్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మేదరి జిల్లా కార్యవర్గం

నవతెలంగాణ-కంఠేశ్వర్

కులవృత్తులకు అండగా ఉంటామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా అన్నారు. మేదరి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల విగ్రహాల పార్క్‌లో మేదరి కుల దైవమైన కేతేశ్వర స్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, జెడ్పీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేతివత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అందులో భాగంగానే వారికి చేయూతగా విశ్వకర్మ యోజన పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.

కులవృత్తులను ప్రోత్సహించాలి..

ప్రభుత్వాలు కులవృత్తులను ప్రోత్సహించాలని జెడ్పీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ రాకతో మేదరి కులవృత్తి కనుమరుగవుతుందని తెలిపారు. అందుకు ప్రభుత్వాలు చేయూతనందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతీ శుభకార్యంలో మేదరులు తయారు చేసిన వస్తువులను ఉపయోగిస్తామని తెలిపారు. పలు గ్రామాల్లో మేదరులతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. అనంతరం పరమపూజ్య శ్రీశ్రీ ఇమ్మడి బసవ మేదర కేతేశ్వర మహాస్వామి చిత్రదుర్గ మాట్లాడారు. అర్బన్ ఎమ్మెల్యేతో పాటు, జెడ్పీచైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావును, ఎమ్మెల్సీ బొమ్మమహేష్‌కుమార్‌గౌడ్‌ను, మేదరి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించి కేతేశ్వర స్వామి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో మేదరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జొర్రీగల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోన రాజశేఖర్, గౌరవాధ్యక్షులు ప్యారసాని బాలరాజ్, రాష్ట్ర కోశాధికారి పాతకోటి ఉమా, జిల్లా అధ్యక్షులు దర్శనం దేవేందర్, సూరీనీడ పోషాద్రి, జొర్రిగల బాలయ్య, ప్రచార కార్యదర్శి దర్శనం గంగాధర్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూరీనీడ బాబురావు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందూర్ నరేష్, రాజకీయ చైతన్య వేదిక అధ్యక్షులు యామ నర్సయ్య అలిపిరెడ్డి రఘు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక


విద్యార్థికి అభినందన

నవతెలంగాణ-సిరికొండ

మహారాష్ట్రలోని ఔరంగాబాద్ శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమన్‌పల్లి జడ్పిహెచ్‌ఎస్ విద్యార్థి మాలవత్ నితీన్ ఎంపికైనట్లు పీఈటి నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23, 24 తేదీలలో హనుమకొండ ఆలేరులో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీలకు నిజామాబాద్ జిల్లా తరపున పాల్గొని తెలంగాణ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి కార్యదర్శి గంగామోహన్‌ను, నితీన్‌ను అభినందించారని తెలిపారు. గురువారం చిమన్‌పల్లి జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ బృందం నితిన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పిఈటి నవీన్, రాజనర్సయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్, కుర్నపల్లి, ఎడపల్లి, జమలం, ఏఆర్‌పి క్యాంప్, ఎమ్మెస్సీఫారం, తానాకాలన్, జానకంపేట్ ఆయా గ్రామాలలో ఆసరా పెన్షన్లను గురువారం పంపిణీ చేశారు.

నర్సరీ పరిశీలన


పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానాకుర్తి గ్రామంలోని నర్సరీని ఎంపీడీవో లింగం నాయక్ పంచాయతీ సెక్రటరీ ధీరజ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. నర్సరీని జాగ్రత్తగా కాపాడాలని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నీటిని పడుతూ వాటిని సంరక్షించే విధంగా చూడాలని ఆయన తెలిపారు. అలాగే గ్రామంలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరించే విధంగా చూస్తానని అన్నారు. ఉపాధి హామీ పనులను గ్రామంలోని నిరుపేదలందరూ ఉపయోగించుకునే విధంగా చూడాలని పంచాయతీ సెక్రెటరీ ధీరజ్‌కు సూచించారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత


బీమా చెక్కు అందజేస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని ముత్యంపేట్ సొసైటీ కార్యాలయంలో విండో చైర్మన్ కోడిప్యాక తిరుపతి గౌడ్ పాలక వర్గం సభ్యులు బాధిత కుటుంబనికి 1 లక్ష రూపాయల జనతా ఇన్సూరెన్స్ చెక్కు ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్యం పేట సొసైటీ లో సభ్యత్వం ఉన్న పున్న సాయిలు అనే రైతు గత సంవత్సరం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మరణించారు. సొసైటీ లో జనతా ఇన్సూరెన్స్ కలిగి ఉండడం తో మృతుని భార్యా పున్న శ్యామలకు 1 లక్ష రూపాయల ఇన్సూరెన్స్ చెక్కు ను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ సిద్దారములు, డైరెక్టర్ లు, సీఈఓ రాంచంద్రం సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

నవతెలంగాణ-బోధన్

ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని బోధన్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఓటుహక్కు పౌరులకు అవగాహన కల్పిస్తూ 5కే రన్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బోధన్ పట్టణంలో గురువారం 5 కే నిర్వహించినట్టు తెలిపారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి ప్రారంభమైన 5కే రన్ అంబేద్కర్ చౌరస్తా' కొత్త బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ నిర్వహించారు. సమాజం నిర్మాణం కోసం రాజ్యాంగం ఓటు హక్కు అనే ఆయుధాన్ని ప్రజలకు అందించిందని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకో వాలని సూచించారు. తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, తహసిల్దార్ కే గంగాధర్, సిఐలు వీరయ్య, నరేష్ కుమార్, విద్యా వికాస్ జూనియర్ కళాశాల కరస్పాం డెంట్ వై శ్రీనివాసరావు, అధికారులు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



5కే రన్‌లో పాల్గొన్న అధికారులు

ఇన్చార్జ్ ఎంపీడీవోగా ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎంపీఓ ప్రవీణ్ కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. అంతకుముందు విధులు నిర్వహించిన ఎంపీడీవో సంతోష్ రెడ్డి ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే.

విద్యార్థుల లక్ష్యం గొప్పదైతే విజయం సులభం

- ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య

నవతెలంగాణ-సిరికొండ


విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థుల లక్ష్యం, సంకల్పం గొప్పదైతే విజయం సులభమవుతుందనడానికి చక్కని నిదర్శనం పాఠశాల పూర్వ విద్యార్థిని మాలవత్ సుమలత అని పాఠశాల స్థాయిలో డాక్టర్ కావాలనే దృఢ సంకల్పం, పట్టుదల తనను డాక్టర్ అయ్యేలా చేసిందని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య అన్నారు. మారుమూల పల్లెలో జన్మించి గ్రామీణ ప్రాంతంలో విద్యనభ్యసించి ప్రతిష్టాత్మకమైన వైద్య విద్య(ఎంబిబిఎస్)లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించిన మాలవత్ సుమలతను గురువారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ..

సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, అనారోగ్యులపట్ల అంకితభావం, మానవీయత, సేవాదృక్పతంతో చికిత్స చేసే వైద్యులు చిరస్మరనీయులని ప్రస్తుత పరిస్థితులలో వైద్యం చాలా విలువైనదని అన్నారు. విద్యార్థులు వైద్య విద్యపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యం కోసం నిరంతరం క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి విట్టల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు


బాజిరెడ్డి గోవర్ధన్‌ను పుష్పగుచ్ఛం అందజేత

నవతెలంగాణ-మోపాల్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ని ఆర్మూర్, బోధన్ నియోజకవర్గ నాయకులు గురువారం తన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. తప్పకుండా ఈ సారి నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎంపీగా పనిచేసిన అరవింద్ జిల్లాకు చేసిందేమీ లేదని తన వల్లనే పసుపు రేటు పెరిగిందని ఆయన ప్రగల్భాలు పలుకుతున్నాడే తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షునికి సన్మానం


కాంగ్రెస్ మండలాధ్యక్షుడిని సన్మానిస్తున్న పలువురు నాయకులు

నవతెలంగాణ-పిట్లం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన జాంబిగే హన్మాండ్లును ధర్మారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ జాంబిగే హన్మాండ్లు పార్టీ , ప్రజల కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తూ , అధిష్టానం ప్రజల కు సేవకుడిగా ఉంటూ , పార్టీ కార్యకర్తలకు భరోసాగా నిలుస్తూ , అహర్నిశల , ఆత్మవిశ్వాసము , మనోధైర్యంతో పనిచేస్తూ ముందుకెళ్తున్నందుకు పార్టీ అధిష్టానం రెండవసారి బాధ్యతలు అప్పగించినట్టు కొనియాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు అహర్నిశల కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మారుతిరావు, రఘునందన్‌రావు, హనుమంతప్ప, హనుమంతరావు, వెంకటేష్, మేకల మారుతి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర దక్కేలా చూడండి : అదనపు కలెక్టర్

నవతెలంగాణ-ఎడపల్లి

నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి ఎలాంటి తరుగు, కోతలు లేకుండా రైతుకు పూర్తి స్థాయిలో మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఐ.కే. పీ ఆధ్వర్యంలో నెలకొల్పిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గన్నీ బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ మెషీన్లు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అధిక సంఖ్యలో హమాలీలను నియమించి, వెంటదివెంట ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియ జరిగేలా పక్కా ప్రణాళికతో పర్యవేక్షణ జరపాలని అన్నారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన అన్నదాతలు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అమ్దాపూర్‌లో ఘనంగా విగ్రహప్రతిష్టాపన

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో శుక్రవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప, కామరతి, మహంకాళి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ప్రారంభించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, కుర్మే యాదవ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.56,800 నగదు స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేకాట స్థావరంపై సిపి కల్మేశ్వర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసిపి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మన్న, సుదర్శన్, అనిల్, నరసయ్య, ఆజాములు నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో పక్క సమాచారం మేరకు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వినాయక్‌నగర్ పేకాట స్థావరంపై దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.56,810 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చర్యల నిమిత్తం నాలువ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సంజీవ్‌కు అప్పజెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామ శివారులో సిద్దాపూర్ నుంచి రెంజల్ వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించినట్లు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న పేర్కొన్నారు. ఈ ట్రాక్టర్‌కు ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. అక్రమ ఇసుక తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.